అభివృద్ధిపథంలో 38వ డివిజన్

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గణనీయమైన మార్పు
- రూ.10 కోట్లతో మౌలిక సదుపాయాలు
- రూ.170 లక్షలతో 0.5 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ఏర్పాటు



మురుగునీటిని శుద్ధి చేసే సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్



మల్లికార్జునపేటలో నిర్మించిన కమ్యూనిటీ హాల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్ గత అయిదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా ఈ డివిజన్ పరిధిలో విద్యాధరపురంలో కొంత, వన్‌టౌన్ మల్లికార్జునపేటలో మరికొంత చేరింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఎక్కువ భాగం కొండ ప్రాంతాలు ఉండటం గమనార్హం. మొత్తం మీద కొండ ప్రాంతంలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మెట్లు, సైడు కాలువలు ధ్వంసమై కొండపై నివసించే ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారయింది. గతంలో గిరివాసుల ఇబ్బందులను పట్టించుకున్న నాథుడు లేడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కొండ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలను కల్పించారు.

సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో మురుగునీటి శుద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు నిధులు కేటాయించారు. ఆ నిధులలోనే రూ.170 లక్షల అంచనా వ్యయంతో డివిజన్ పరిధిలోని చేపల రేవు వద్ద (మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వెనుక) 0.5 ఎంఎల్‌డీ సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మించారు. డివిజన్ పరిధిలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్స్, సైడు కాలువల ద్వారా వచ్చే మురుగునీటిని ఈ ప్లాంట్ దశలవారీగా శుద్ధి చేస్తుంది. అనంతరం ఆ నీటిని ట్యాంకర్లలో నింపి నగరపాలక సంస్థకు చెందిన పార్కుల్లోని మొక్కలు, డివైడర్లపై ఉండే మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇంకా మిగిలితే పక్కనే ఉన్న కృష్ణానదిలోకి వదులుతున్నారు.

రూ.90 లక్షలతో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి

హిందూ శ్మశానవాటికను రూ.90లక్షలతో అభివృద్ధి చేశారు. ఇది గట్టు వెనుక ప్రాంతంలో ఉన్న ఏకైక హిందూ శ్మశానవాటిక. విజయవాడ నగరంలో తొలిసారిగా ఇక్కడ గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం ఏర్పాటు చేశారు. దీనికి రూ.60లక్షలు ఖర్చు చేయగా, బాత్ రూమ్స్, జనరేటర్ గది, అస్తికలను భద్రపరచేందుకు గది, టాయిలెట్స్ వంటి వసతులను రూ.30లక్షలతో కల్పించారు. ఇవి కాకుండా మృతదేహంతో పాటు వచ్చే బంధుమిత్రులు కొద్ది సేపు సేద తీరేందుకు రేకుల షెడ్ నిర్మించారు. మొత్తం మీద శ్మశానవాటిక రూపురేఖలను మార్చివేయటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటిక ముందున్న ఖాళీ స్థలంలో రూ.3లక్షల వ్యయంతో శానిటరీ స్టోరేజ్ రూమ్‌ను నిర్మించనున్నారు.

రూ.60 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

డివిజన్ పరిధిలోని మల్లికార్జునపేటలో రూ.60లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు కమ్యూనిటీ హాల్ లేని లోటును భర్తీ చేశారు. సామాన్యులు చిన్నచిన్న ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇది దోహదపడుతుంది. డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నిమిత్తం స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పలు ప్రతిపాదనలు చేసి వాటికి అంచనాలను కూడా వేయించారు. వాటిల్లో రూ.1.30 లక్షలతో ప్రకాశం బ్యారేజి దగ్గర లోతట్టులో ఉన్న హజరత్ సయ్యద్ అలీ ఖాదరీ దర్గా ఎత్తు పెంచటం, ఆవరణలో మసీదు, విడిది గదుల నిర్మాణం, కోటి రూపాయలతో డీఎస్‌ఎం హైస్కూల్ ఎదుట మలేరియా హాస్పిటల్, జనన మరణాల నమోదు కార్యాలయం, జిమ్ ఏర్పాటుకు గాను భవనం నిర్మించారు.

అభివృద్ధి చేసి చూపించాం



డివిజన్ ఇంతగా అభివృద్ధి చెందిందంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన నిధులను మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సద్వినియోగం చేయటమే కారణం. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశాం.

– షేక్ రెహమతున్నీసా, 38వ డివిజన్ కార్పొరేటర్

పార్టీ శ్రేణులకు, పశ్చిమ ప్రజలకు ధన్యవాదాలు

షేక్ అసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. ఆ క్రమంలో తనకు సహకరించిన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, ఆలయాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు ముఖ్యంగా అనేక ఇబ్బందులు, ఆకర్షణలు ఎదురైనా నిస్వార్థంగా తనకు అండగా నిలిచి ముందుకు నడిపించిన ప్రతి కార్యకర్తకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరూ చూపించిన ఆప్యాయతకు, ఓటు వేసి మద్దతు తెలిపిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా తనపై నమ్మకాన్ని ఉంచి పార్టీ అభ్యర్థిగా నిలబెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జన్మంతా రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.కాలనీ ఎస్‌వీసీటీ కల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆరు నుంచి 7.15 గంటల వరకు జరుగుతాయని, ఇతర వివరాలకు సెల్: 63014 54859లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నేరస్తుడి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజా జీవనానికి భంగం కలిగిస్తున్న నేరస్తుడు కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి అలియాస్ బారురెడ్డి నగర బహిష్కరణను పొడిగిస్తూ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు బారురెడ్డి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించాడని, జైలు నుంచి విడుదలైన తరువాత అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గతంలోనే నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగించినట్లు స్పష్టం చేశారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థాన వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, ఇతర ఆలయ అర్చకులు పాల్గొన్నారు. పలువురు ఉభయదాతలు పూజలో పాల్గొనగా వారికి ఆలయ అర్చకులు ప్రసాదాలను అందజేశారు.

నవగ్రహాలకు పదివేల గులాబీలతో పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో అమావాస్య, గురువారం పురస్కరించుకుని నవగ్రహాలకు పదివేల గులాబీలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శివాచార్యస్వామి నవగ్రహాలకు పంచగ్రాహి కూటమి పురస్కరించుకుని విశేషంగా అర్చనలు అభిషేకాలు నిర్వహించారు.పాలడుగు హైమావతి, బచ్చు శ్రీధర్, పెద్ద సంఖ్యలో భక్తులు పూజలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సౌర కుటుంబంపై విద్యార్థులకు అవగాహన



మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా సౌర కుటుంబంపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిలుకూరివారిగూడెం ఎస్ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుడు డీవీఎస్ శివవరప్రసాద్ మాట్లాడుతూ సౌర కుటుంబం –మన విశ్వంలో మనం నివసించే భూమి ఒక గ్రహం అని, ఆ భూమిని ఏ విధంగా పరిరక్షించాలి అనే విషయాలను వివరించారు. మిగిలిన గ్రహాలలో జూపిటర్ పరిమాణం భూమి పరిమాణానికి ఎన్నో రెట్లు అధికంగా ఉంటుందని గుణాంకాలతో సహా వివరించారు.

పేపర్ క్రాఫ్ట్ తయారీలో విద్యార్థులకు శిక్షణ



తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఉదయం జరుగుతుందని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ తయారీ, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించామని పద్మావతి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి విద్యార్థినీ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

10న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకలను ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని ఆలయ ఈఓ వై. సీతారామయ్య గురువారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ కానుకలను లెక్కిస్తామని చెప్పారు.

ప్రభుత్వం ఏర్పడకముందే ప్రతీకార చర్యలు దారుణం

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే రాష్ట్రంలో విధ్వంసాన్ని సృష్టిస్తూ ప్రతీకార చర్యలకు ఆ పార్టీ నేతలు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమికి సారథ్యం వహించి విజయం సాధించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, పురంధేశ్వరి తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేవలం 10 లక్షల ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ 88 అసెంబ్లీ స్థానాలని కోల్పోయిందని పేర్కొన్నారు. 10 లక్షల ఓట్లు వచ్చి ఉంటే వంద సీట్లతో మరొకసారి ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేసేవారన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 5,000 ఓట్ల తేడాతో 19 సీట్లు, 10,000 ఓట్ల తేడాతో 28 సీట్లు, 15,000 ఓట్ల తేడాతో 41 స్థానాలని కోల్పోయిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి చేస్తున్న విష ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కూటమి కలిసి ఉంటుందని గ్యారెంటీ లేదన్నారు. కూటమి పాలన పెట్టుబడిదారులకు మాత్రమే అండగా ఉంటుందన్న విషయాన్ని ప్రజలు త్వరలోనే అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పేద సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్నందుకే వారిపై కూటమి విషప్రచారం చేసిందని తెలిపారు. అభివృద్ధి అంటే భవనాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కాదన్న వాస్తవం ప్రజలకు అతి త్వరలోనే అవగాతమవుతుందని పేర్కొన్నారు. జగన్ పేద సామాన్య వర్గాల జీవన ప్రమాణాల పెంపు కోసం విప్లవాత్మకంగా తెచ్చిన పథకాల విలువ ప్రజలకు అర్థమవుతుందన్నారు. జగన్ విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, అమ్మఒడి, ఇంగ్లిష్ మీడియం, చిన్న జిల్లాల ఏర్పాటు, వలంటరీ వ్యవస్థ, సెంటు భూమి, అమరావతిలో ఇళ్ల పట్టాలు వంటి కార్యక్రమాలను కూటమి కొనసాగిస్తుందా లేక రద్దు చేస్తుందో చూడాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబావారి పాదుకలకు పూజలు



బాబావారి పాదుకలతో మహల్సాపతి మునిమనుమడు శ్రీకాంత్, తంగెళ్ళమూడి వీరమోహనరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాబావారు స్వయంగా ధరించిన పాదుకలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. షిర్డీ నుంచి మహల్సాపతి ముని మనుమడు శ్రీకాంత్ బాబావారు స్వయంగా ధరించిన పాదుకలను మందిరానికి తీసుకువచ్చారు. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు, భక్తులు బాబావారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారి పాదుకలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహల్సాపతి ముని మనుమడు శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీదత్తసాయి మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు కోరిక మేరకు బాబావారి పాదుకలను నగరానికి తీసుకువచ్చామన్నారు. బాబావారు స్వయంగా ధరించిన పాదుకలను బాబా భక్తులు దర్శించుకునేలా ఏర్పాటు చేశామన్నారు. తంగెళ్ళమూడి మోహనరావు మాట్లాడుతూ బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే ఉద్దేశంతో బాబావారు స్వయంగా ధరించిన పాదుకలను తీసుకువచ్చి భక్తుల దర్శనార్థం ఉంచామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వి. రామకోటేశ్వరరావు సూచించారు. స్థానిక ముత్యాలంపాడులో గురువారం ఆయన వర్షాకాలం ప్రారంభం అయిన దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తచెదారంను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా ఇంటికి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని, పారిశుద్ధ్య సిబ్బంది సూచించిన ప్రాంతాలలోనే చెత్త వేయాలని అన్నారు. ముఖ్యంగా మురుగుకాలువలు, కాలువలలో చెత్త వేయటం వల్ల మురుగు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా ఇంటికి వచ్చిన ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని ఆరోగ్యకేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తద్వారా దోమలు పెరగకుండా నియంత్రించ వచ్చని ఆయన తెలిపారు.


నీట్‌లో ప్రతిభ చూపిన కేబీఎన్ ఫైన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫైన్ విభాగం విద్యార్థులు ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభను చూపారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఐదుగురు మెడికల్ సీట్లు సాధించే ర్యాంకులను పొందారని చెప్పారు. 97.6 శాతంతో శివాన్ష్‌షా ఎంబీబీఎస్ సీటుకు, 493 మార్కులతో జి.భారతి, 440 మార్కులతో ఇ.వెంకటేశ్వరరావు బీడీఎస్ సీట్లను సాధించే అవకాశముందని తెలిపారు. షేక్ ఆస్మా, ఎం.సాయిస్రవంతి బీఏఎంఎస్‌లు సీట్లు సాధించే అవకాశముందని అన్నారు. చాలా తక్కువ మంది విద్యార్థులతో తమ కళాశాల అద్భుతమైన మార్కులను సాధించినట్టు తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అభినందించారు.కార్యక్రమంలో టి.నరేంద్రకుమార్, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ వద్ద సీసీ రోడ్డు ప్రారంభానికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. శిలాఫలకాలను పగుల కొట్టి ముక్కలు ముక్కలు చేశారు. దీనిపై సర్పంచ్ బి. జ్యోతిబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు.

నల్లరంగు పూసినవారిపై చర్యలు తీసుకోవాలి

వెలంపల్లి ఫౌండేషన్ డైరెక్టర్ కొనకళ్ల విద్యాధరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదీ తీరాన ఉన్న పిండ ప్రదాన రేవులో ఎండ, వానలకు పురోహితులు ఇబ్బందులు పడకుండా వెలంపల్లి ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన షెడ్‌పై ఉన్న నేమ్ బోర్డ్‌పై నల్ల రంగు పూయటాన్ని ఫౌండేషన్ డైరెక్టర్ కొనకళ్ల విద్యాధరరావు తీవ్రంగా ఖండించారు. గురువారం పిండ ప్రదాన రేవులో ఆయన మీడియాతో మాట్లాడుతూ పురోహితుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తమ ఫౌండేషన్ నిధులు సుమారు రూ.14 లక్షల వ్యయంతో షెడ్ నిర్మించారని, గుర్తు తెలియని వ్యక్తులు కొందరు బుధవారం రాత్రి ఎవరూ లేని సమయంలో వచ్చి వెలంపల్లి పేరుపై నల్ల రంగు పూసారని తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్ సెంటర్‌కు సమీపంలోని భెల్ కంపెనీ వెనుక రోడ్డులో గుర్తు తెలియని వృద్ధురాలు మూడు రోజుల క్రితం స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు 108కు ఫోన్ చేసి సదరు వృద్ధురాలిని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు గురువారం మృతి చెందారు. మృతురాలు ఎర్ర రంగు చీర పచ్చ రంగు జాకెట్ ధరించి ఉన్నారు. ఆమె వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలియకపోవడంతో గుర్తుతెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి సీఐ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే 08672–252233 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం తెలియజేయాలని తెలిపారు.

ప్రభుత్వ స్థలాల వేలం నిలిపి వేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వ స్థలాల అమ్మకాలు నిలిపివేయాలని సీఐటీయూ కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. కొండపల్లిలో బీఎస్ఎన్ఎల్ స్థలం అమ్మకానికి ఈవేలం ప్రకటన విడుదల చేయడం దుర్మార్గమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఈ టెండర్‌కు పిలుపు ఇవ్వడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పోస్టాఫీస్ భవనం ఆ స్థలంలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

విద్యార్థుల అప్రెంటీస్‌షిప్‌నకు అనుమతి

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బీబీఏ లాజిస్టిక్స్ విద్యార్థులకు హైదరాబాద్ జిలాగ్ లాజిస్టిక్స్ కంపెనీ, చెన్నైలోని లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్‌లో ఒక సంవత్సరం పాటు అప్రెంటీస్‌షిప్ చేయడానికి అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కళాశాలలో కంపెనీల యాజమాన్యంతో గురువారం జరిగిన అవగాహనా సదస్సులో తమ కళాశాల విద్యార్థులకు లాజిస్టిక్స్ కంపెనీలో ఎలా పనిచేయాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారన్నారు. ఐదుగురు విద్యార్థులకు డీహెచ్‌ఎల్ కంపెనీలో, ఆరుగురు విద్యార్థులకు హైదరాబాద్ ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో అప్రెంటిస్‌షిప్ ఏర్పాటు చేశామన్నారు. వీరు అన్ని సదుపాయాలతో కలిపి ప్రతి నెలా రూ.15 వేల వేతనం పొందుతారని చెప్పారు. లాజిస్టిక్ కంపెనీ ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి సుధా మాట్లాడుతూ బీబీఏ లాజిస్టిక్స్ చదివే విద్యార్థులు మూడో ఏడాది నుంచి చదువుతో పాటు కంపెనీలో పని చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురుగుకాలువల్లో సిల్టు తొలగింపు

- చెత్త, చెదారం మురుగుకాలువల్లో వేయొద్దు
- ప్రజలకు ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు విజ్ఞప్తి



సిల్టు తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ చెత్తచెదారంను పారిశుద్ధ్య సిబ్బంది సూచించిన ప్రాంతాలలోనే వేయాలని, మురుగుకాలువల్లో వేయొద్దని ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వి.రామకోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నగరంలోని పలు ప్రాంతాలలో సిల్టు తొలగింపు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మురుగుకాలువలు సక్రమంగా పారేందుకు సిల్టును తొలగిస్తున్నామన్నారు. సిల్టు ఉండటం వల్ల మురుగు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా తాము సిల్టు తొలగింపు పనులు చేపట్టామని, ప్రజలు సహకరించాలని కోరారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం



పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం, చండీహోమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌శర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత అర్ధనారీశ్వరుడైన రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగాయి. యాగశాలలో మహన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, చండీహోమాలను జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు హోమంలో పాల్గొని స్వామి వారి అనుగ్రహాన్ని పొందారు. మధ్యాహ్నం దేవస్థాన ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ జరగగా, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బొమ్మలండీ.. బొమ్మలు



కృష్ణలంక సమీపంలో విక్రయిస్తున్న బొమ్మలు



బొమ్మలండీ...బొమ్మలు...అందమైన బొమ్మలు...మన ఇంట్లో పసిపాపల్లాంటి బొమ్మలు... జీవం ఉట్టిపడే బొమ్మలు... గడప దాటి బయటకు వచ్చేవరకు పిల్లలకు ప్రియనేస్తాలు ఈ బొమ్మలే... నగరంలో కృష్ణలంక సమీపంలో అందమైన బార్బీ డాల్స్ బొమ్మలు విక్రయిస్తున్నారు. ఇవి చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ